




ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 6: జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో గల ఈవీఎం గోదాంను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మంగళవారం సందర్శించారు. త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎం గోదాంలో ఎలాక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్‌లెవల్ చెకింగ్ నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు. వరుసగా రెండో రోజు మంగళవారం కలెక్టర్ ఈవీఎంగోదాంలోను సందర్శించి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్‌ల పనితీరు పరిశీలన కోసం ఈసీఐఎల్ ఇంజనీర్లు నిర్వహిస్తున్న ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించారు. ఎన్నికల సంఘం నిబంధనలను తప్పకుండా పాటించాలని, ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులను సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంబంధిత అధికారులు ఉన్నారు.

సబ్సిడీపై ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

: డీఆర్‌డీవో పీడీ చందర్ నాయక్


డిచ్‌పల్లి, ఫిబ్రవరి 6: జిల్లాలోని మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని 35శాతం సబ్సిడీ రుణాల ద్వారా మహిళా సంఘాలకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని డీఆర్‌డీవో పీడీ చందర్ నాయక్ తెలిపారు. మంగళవారం ఇందూరు జిల్లా మహిళా పరస్పర సమాఖ్య జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023-24లో కూడా ఆర్థిక సంవత్సరం బ్యాంకు లక్ష్యం సాధించేందుకు కృషి చేయాలని, నిరుపేద మహిళలను స్వయం సహాయక సంఘాల్లో చేర్చుకొని వారికి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా వచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం సంఘాల ప్రతినిధులకు స్కూల్ యూనిఫాం, పోలీసు యూనిఫాం కుట్టే అవకాశం కల్పిస్తామని పాఠశాలలో ఖాళీగా ఉన్న వంటలు చేసే ఏజెన్సీలు మహిళా సంఘాలకు అప్పగిస్తామన్నారు. డీఆర్‌డీఏ ద్వారా మార్కెటింగ్ ఖరీఫ్, రబీ సీజన్‌లో 2022-23లో 10 శాతం కమీషన్‌పై 21,97,485 రూపాయల చెక్కును జిల్లా సమాఖ్యకు డీఆర్‌డీవో అందజేశారు. అదే విధంగా ప్రస్తుతం ఖాళీగా ఉన్న జిల్లా అధ్యక్షురాలు స్థానంలో నూతన అధ్యక్షురాలుగా రాధను ఎన్నుకున్నట్లు పీడీ తెలిపారు. ఇందులో అడిషనల్ పీడీ మధుసూదన్, డీపీఎంలు శ్రీనివాస్, సంధ్యారాణి, నీలిమ, మారుతి, రాచయ్య, స్త్రీనిధి ఆర్ఎం రాందాస్, ఏపీఎం సంజన పాల్గొన్నారు.

భూం ఫట్

- మామిడిపల్లి శివారులోని ప్రభుత్వ భూములు కబ్జా
- నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకు చెందిన స్థలాలపై అక్రమార్కుల కన్ను
- ఆక్రమణకు సుమారు రూ.4కోట్ల విలువైన భూమి
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

ప్రభుత్వ భూమిని కబ్జా చేసి బోరు వేసిన దృశ్యం

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 6: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి శివారులోని 44వ జాతీయ రహదారి ఆనుకొని ఉన్న నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకు చెందిన భూములు కబ్జాకు గురవుతున్నాయి. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం 2004-05 సంవత్సరంలో భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. 2007-08లో సేకరించిన భూమికి పట్టాదారులకు నష్టపరిహారం అందజేసింది. సర్వేనెంబర్ 196, 197, 199లో భూమిని సేకరించారు. రోడ్డు వేయగా కొంతమేరకు మిగిలిన భూమి రోడ్డు పక్కన అలాగే ఉంది. దీంతో కొందరు అక్రమార్కులు దానిపై కన్నేశారు.



ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన ప్రహరీ

ప్రభుత్వ భూమి అని తెలిసినా..

నేషనల్ హైవేకు చెందిన భూమి అయినప్పటికీ కొందరు భూమిని చదును చేసి తాత్కాలిక ప్రహరీ (ప్రీకాస్ట్) నిర్మించి బోరువేశారు. గతంలో పలువురు పట్టాదారుల నుంచి హైవే నిర్మాణానికి ప్రభుత్వం భూమిని సేకరించింది. హైవే నిర్మాణం పూర్తి కాగా సేకరించిన భూమిలో మామిడిపల్లి నుంచి హైవే పై వెళ్లే స్థలంలో సుమారు అరఎకరం భూమి నేషనల్ హైవేకు చెందినది. ఈ భూమిపై కన్నేసిన కొందరు కబ్జాకు సిద్ధమయ్యారు.

ఎన్నికల సమయంలో పనులు..

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే ఈ స్థలంలో నిర్మాణాలకు సిద్ధపడ్డారు. ఎన్నికల సమయంలో అధికారులు బీజీగా ఉండి ఇటు వైపు రారు.. గమనించారన్న ధీమాతో పనులు ప్రారంభించారు. భూమిని చదును చేసి గోడలను నిర్మించి బోరు వేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న నేషనల్ హైవే అధికారులు ఈ భూమి తమదని రైతులకు నష్టపరిహారం చెల్లించామని తమకే చెందిన భూమి అని, ఎవరు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని నోటీసులు ఇచ్చి పనులను అడ్డుకున్నట్లు తెలిసింది. కబ్జాకు గురవుతున్న భూమి ధరణిలో సైతం ప్రభుత్వ భూమిగా ఉంది. కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.

ప్రభుత్వ భూములను కాపాడాలి..

నేషనల్ హైవేకు చెందిన ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. సాధారణంగా నేషనల్ హైవే స్థలాన్ని ఎవరికీ బదలాయించరు. అయినా స్థలాన్ని కాపాడాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వ అధికారులపై ఉంది. నేషనల్ హైవే అధికారులు తమ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నా అవేమి పని చేయడంలేదు. ఇలా ఉండగా తమ భూమిని సర్వేచేసి ఇవ్వాలని రెవెన్యూ అధికారులను గతంలోనే నేషనల్ హైవే అధికారులు కోరినట్లు తెలిసింది. హైవేను ఆనుకొని ఉన్న ఈ స్థలంలో పార్కు ఏర్పాటు చేసి మున్సిపాలిటీకి నిర్వహణ బాధ్యత అప్పగిస్తే పిల్లలకు, పెద్దలకు ఉపయోగకరంగా ఉంటుంది. అదే విధంగా ప్రభుత్వ భూమిని కాపాడినవారవుతారని ప్రజలు భావిస్తున్నారు.

స్థలాన్ని సర్వే చేయిస్తాం..

: వినోద్‌కుమార్, ఆర్డీవో, ఆర్మూర్

మామిడిపల్లి శివారులోని నేషనల్ హైవేకు చెందిన భూమిని కొందరు కబ్జాకు యత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. పనులు నిలిపి వేయించాం. నేషనల్ హైవే అధికారులు రెవెన్యూ సర్వే అధికారులతో సమావేశం నిర్వహిస్తాం. జాతీయరహదారుల వెడల్పు పనుల సర్వే జరుగుతోంది త్వరలోనే ప్రభుత్వ భూమిని సర్వే చేయించి కాపాడతాం.

‘మహాలక్ష్మి’ తప్పిదాల సవరణకు సర్వే బృందాలు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 6: మహాలక్ష్మి పథకం దరఖాస్తులోని తప్పిదాల సవరణకు ప్రభుత్వం ప్రత్యేక సర్వే బృందాలను ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా ‘మహాలక్ష్మి’ పథకానికి దరఖాస్తులు స్వీకరించింది. అయితే దరఖాస్తుల్లో నెలకొన్న తప్పిదాలను సవరించేందుకు జిల్లాలో ప్రత్యేక సర్వే బృందాలను నియమించామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మంగళవారం తెలిపారు. ఈ బృందాలు బుధవారం నుంచి సర్వే చేపడతాయన్నారు. ‘మహాలక్ష్మి’ పథకం కింద పేదలకు వంట గ్యాస్ సిలిండర్ రూ.500 అందించాలని ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించామని తెలిపారు. అయితే ఈ దరఖాస్తులలో పలువురు సమగ్ర వివరాలను పేర్కొనలేదన్నారు. గ్యాస్ ఏజెన్సీ పేరు, కన్స్యూమర్ నెంబర్, రేషన్ కార్డు నెంబర్ వంటి వివరాలను దరఖాస్తులో సరిగా పొందుపర్చలేదని కలెక్టర్ తెలిపారు. సర్వే బృందాలు దరఖాస్తు దారులను సంప్రదించి ఈ-యాప్ సహాయంతో వివరాలను సరిచేయడం జరుగుతోందని తెలిపారు. మండలాల పరిధిలో ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, మున్సిపల్ పట్టణాల్లో కమిషనర్లు ఇతర అధికారుల నేతృత్వంలో సర్వే జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుదారులు సర్వే బృందాలకు సహకరించాలని కోరారు. సరిగా ఉన్న దరఖాస్తులు ప్రభుత్వ ఆమోద నిమిత్తం పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. సర్వే బృందాలు తమను సంప్రదించలేదని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు.

ఉచిత విద్యుత్‌కు సమాయత్తం

- డాటా ఎంట్రీ చేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు
- రేషన్ కార్డు, ఆధార్‌కార్డు తప్పనిసరి
- జిల్లా వ్యాప్తంగా 4లక్షల 80వేల విద్యుత్ కనెక్షన్లు



నందిపేటలో వివరాలు సేకరిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 6: ఇప్పటికే రెండు గ్యారెంటీలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు గ్యారెంటీలను అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి విద్యుత్‌శాఖ అధికారులు సమీక్షలు జరిపి 200యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం వినియోగదారుల నుంచి ఏ వివరాలు సేకరించాలనే దానిపై కిందిస్థాయి ఉద్యోగులకు సలహాలు అందజేశారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ నుంచి కిందిస్థాయి ఉద్యోగుల వరకు ఉచిత విద్యుత్ అమలుపై చర్చించారు. నూతన సాఫ్ట్‌వేర్ సైతం విద్యుత్‌శాఖ అధికారులకు చేరడంతో డాటాఎంట్రీకి సిద్ధమయ్యారు. ఉదయం నుంచి ఇంటింటికీ తిరుగుతూ డాటా ఎంట్రీ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 4లక్షల 80వేల విద్యుత్ కనెక్షన్లు ఉండగా వీటిలో తెల్లరేషన్‌కార్డు ఉన్నవారికే ఉచిత విద్యుత్ పథకం అందనుంది.

అధికారులకు సహకరించాలి..

: రవీందర్, ఎస్ఈ

వివరాలు నమోదు చేసేందుకు వచ్చే విద్యుత్ శాఖ అధికారులకు వినియోగదారులు సహకరించాలి. ఉచిత విద్యుత్‌కు అవసరమయ్యే తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, సర్వీస్ నెంబర్లను చూపించాలి. విద్యుత్‌శాఖ అధికారులు వాటి వివరాలు సేకరించి ఎంట్రీ చేయనున్నారు. ప్రభుత్వ ఆదేశాలు రాగానే పథకం ప్రారంభం కానుంది.

రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు తప్పనిసరి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహజ్యోతి పథకం కింద 200యూనిట్ల ఉచిత విద్యుత్ అమలుకు తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారు మాత్రమే అర్హులుగా పేర్కొంది. వీటితోపాటు ఇంటికి వచ్చే వారికి ఆధార్‌కార్డు, సర్వీస్‌నెంబర్ ఇస్తే వారు సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చనున్నారు. అద్దెకు ఉంటున్న ఇంటి మీటరు నెంబర్‌తో పాటు వారి రేషన్‌కార్డు, ఆధార్‌నెంబర్‌ను నమోదు చేయనున్నారు. ప్రతినెలా 15వతేదీలోపు విద్యుత్ పంపిణీ సంస్థ బిల్లులు జారీచేయనుంది. ఈ నెల 15నాటికి తెల్లరేషన్‌కార్డు ఉన్నవారు ఎందరో స్పష్టం కానుంది. దీంతో పథకాన్ని తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు అమలు చేయనుంది.



దళారుల మాయ

- జిల్లాలో చేతికొస్తున్న ఎర్రజొన్న పంట
- కొనుగోలుకు సిండికేట్ అవుతున్న వ్యాపారులు
- డిమాండ్ ఉన్నా ధరలు తగ్గిస్తున్న వైనం
- ఒప్పందం ప్రకారం కొనుగోలు చేయాలంటున్న రైతులు

నిజామాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ప్రతియేడు యాసంగిలో ఎర్రజొన్న సాగవుతున్నా పంట చేతికొచ్చిన సమయంలో దళారులు రంగప్రవేశం చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు. పంటవేసే సమయంలో ఒప్పందాలు జరుగుతున్నా కోసే సమయంలో మాత్రం డీలర్లు, వ్యాపారులు కొనుగోలుకు ముందుకు రావడం లేదు. ఉత్తరాది రాష్ట్రాల్లో డిమాండ్ తగ్గుతుందనే పేరుతో ధరలను తగ్గిస్తున్నారు. ఏ ఏడుకాయేడు రేట్లు ఉన్నా రైతులకు మాత్రం తక్కువ మొత్తంలోనే చెల్లింపు చేస్తున్నారు. జిల్లాలో గడిచిన పది రోజులుగా ఎర్రజొన్న కోతలు రైతులు మొదలుపెట్టారు. కొన్ని గ్రామాల పరిధిలో అమ్మకాలను చేస్తున్నారు. కొద్దిమంది రైతులకు క్వింటాలు 4వేల వరకు ఒప్పందాలు చేసుకున్నా మిగతా రైతుల ఎర్రజొన్నలకు మాత్రం క్వింటాలు 3600 నుంచి 3800 వరకు కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. పంట వేసే సమయంలో ఉన్న ఒప్పందం ప్రకారమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

30ఏళ్లుగా పంటల సాగు

జిల్లాలో 30ఏళ్లుగా ఎర్రజొన్న సాగు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో ఈ ఎర్రజొన్నలను పశువుల కోసం వినియోగిస్తారు. అక్కడ ఈ పంటకు భూమి అనుకూలంగా లేకపోవడం వల్ల జిల్లాలో ఈ సాగును కొనసాగిస్తున్నారు. ఆర్మూర్ డివిజన్ పరిధి లోని 14మండలాల్లో ఈ ఎర్ర జొన్న సాగును కొనసాగిస్తున్నారు. ప్రతియేడు 35 వేల ఎకరాలనుంచి 40వేల ఎకరాల వరకు ఈ యాసంగిలో సాగుచేస్తున్నారు. గతంలో ఎర్రజొన్న సాగు చేసిన రైతులకు ధరలు తగ్గడం వల్ల ఆందోళనలు నిర్వహించడంతో గడిచిన కొన్నేళ్లుగా పంట వేసే సమయంలోనే డీలర్లు, వ్యాపారులతో రైతులు ఒప్పందం చేసుకునే విధంగా వ్యవసాయ శాఖ అధికారి చర్యలు చేపట్టారు. పంట చేతికి వచ్చే సమయంలో గొడవలను తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఒప్పందం ప్రకారం పంట కొనుగోలు చేయకపోతే వ్యాపారులపై చర్యలు తీసుకునేందుకు అధికారులు ఈ ఒప్పందాలను చేయిస్తున్నారు.

ఎర్రజొన్నలకు పెరిగిన డిమాండ్

ఎర్రజొన్నలకు కొన్నేళ్లుగా డిమాండ్ పెరుగుతోంది. క్వింటాలు 3వేల నుంచి 4వేల మధ్య అమ్మకాలు జరుగుతున్నాయి గతంలో కర్ణాటకలోని రాయచూర్, బళ్లారి ప్రాంతంలో ఈ ఎర్రజొన్నలు పండించినా అక్కడ సాగుతగ్గడం వల్ల ఇక్కడ పండించే పంటకు డిమాండ్ వస్తుంది. ఈ సంవత్సరం కూడా జిల్లాలో ఈ యాసంగిలో 39వేల ఎకరాల్లో ఈ పంటను వేశారు. ప్రస్తుతం అన్ని మండలాల పరిధిలో రైతులు ఎర్రజొన్న పంటను కోస్తున్నారు. ఎర్రజొన్నలను ఆరబోసి అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. కొంతమంది రైతులు ఇప్పటికే అమ్మకాలను మొదలు పెట్టారు. కొద్దిమంది రైతులకు వ్యాపారులు క్వింటా 4 వేల వరకు కొనుగోలు చేసినా ఎక్కువ మంది అమ్మకానికి సిద్ధంకావడంతో తగ్గిస్తున్నారు. డిమాండ్ ఉన్న గ్రామాల పరిధిలో డీలర్లకు అనుగుణంగా క్వింటా3600నుంచి 3800 వరకు ఒప్పందాలను చేసుకుంటున్నారు. బయటి రాష్ట్రాల్లో డిమాండ్ ఉన్నా వ్యాపారులు మాత్రం రేట్లు పెట్టేందుకు ముందుకు రావడం లేదు.

డిమాండ్ ఉన్నా.. ధరలు పెట్టడం లేదు..

: ఏలేటి విజయ్‌రెడ్డి, రైతు ముప్కాల్

ఎర్రజొన్నలకు డిమాండ్ ఉన్నా ధర పెట్టడం లేదు. ఒప్పందం ప్రకారం కొనుగోలు చేయడం లేదు. వ్యాపారులు సిండికేట్ కావడం వల్లనే ధర తగ్గుతుంది. కొనుగోలు చేసే సమయంలో కూడా ధరలు తగ్గించి తీసుకుంటున్నారు. పంట వేసే సమయంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఎర్రజొన్నలను కొనుగోలు చేయాలి.

ధరలు తగ్గకుండా చూడాలి..

:అన్వేష్ రెడ్డి, కిసాన్‌కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్

జిల్లాలో ఎర్రజొన్నలకు ధరలు తగ్గకుండా చూడాలి. కొనుగోలును అధికారులు పర్యవేక్షించాలి. ఉత్తరాది రాష్ట్రాల్లో ప్రస్తుతం ఎర్రజొన్నలకు డిమాండ్ ఉంది. వ్యాపారులు సిండికేట్ కావడం వల్లే ధరలు తగ్గుతున్నాయి. గ్రామాల వారీగా అధికారులు పరిశీలించి కొనుగోలు జరిగే విధంగా చూడాలి.

జిల్లాలో సుమారు 40 మంది వ్యాపారులు

జిల్లాలో ఎర్రజొన్నలు కొనుగోలు చేసే చిన్న పెద్ద వ్యాపారులు సుమారు 40మంది వరకు ఉన్నారు. వీరే కాకుండా మరికొంతమంది కొనుగోలు చేస్తున్న వారు కూడా ఈ వ్యాపారులతో అమ్మకాలను చేస్తున్నారు. వీరిలో చాలామందికి గోడౌన్లు ఉండడం ఉత్తరాది వ్యాపారులతో సంబంధాలు ఉండడం వల్ల వారితో ఒప్పందాలు చేసుకుని ఎర్రజొన్నలను కొనుగోలు చేస్తున్నారు. రైతుల నుంచి తీసుకున్న ఎర్రజొన్నలను కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేస్తున్నారు. అక్కడి వ్యాపారుల అవసరానికి అనుగుణంగా ఇక్కడి నుంచి ఎర్రజొన్నలను ఆ రాష్ట్రాలకు పంపిస్తున్నారు. డీలర్లు, వ్యాపారులు సిండికేట్ కావడం వల్ల ధరలను నియంత్రిస్తున్నారు. రైతులు మొదట చేసుకున్న ఒప్పందాల ప్రకారం ధరలు పెట్టాలని కోరుతున్నారు.





రాష్ట్ర ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి



ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

- ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిపై కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 6: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ డిమాండ్ చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై మంగళవారం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మండల కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతదూ తొమ్మిదేళ్ల కాలంలో కేసీఆర్ రాష్ట్రాన్ని దోచుకుంటే.. మంత్రిగా వేముల ప్రశాంత్ రెడ్డి నాసీరకం చెక్‌డ్యాంలు ఆర్అండ్‌బి రహదారులంటూ కోట్ల రూపాయలు దండుకున్నారని వారు ఈ సందర్భంగా ఆరోపించారు. అంతేకాకుండా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ బాల్కొండ నియోజకవర్గంలోని పలు గ్రామాలలో వంద కోట్ల రూపాయలు ఖర్చు చేయడమే ఇందుకు ప్రత్యేక నిదర్శనమని వారు పేర్కొన్నారు. అంతేకాకుండా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి సీఎం రేవంత్ రెడ్డి వంతులవారీగా అమలుకు కృషి చేస్తుంటే.. బీఆర్ఎస్ నాయకులు అధికారం దక్కలేదన్న అక్కసుతో అనాలోచితంగా నోరుపారేసుకుంటున్నారని ఆరోపించారు. 60వేల కోట్ల రూపాయల మిగులు ఉన్న రాష్ట్రాన్ని కోట్ల అప్పులోకి తీసుకెళ్లి ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చేబితే ప్రజాతీర్పును గౌరవించాల్సింది పోయి, వారి తీర్పునే అపహాస్యం చేస్తూ.. ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని వారు అన్నారు. ఎన్నికల్లో తప్పుడు ప్రొసిడింగ్ పత్రాలు ఇచ్చిన ఘనత ప్రశాంత్ రెడ్డిది కాదా అన్నారు. ఈవిషయమై తగిన విచారణ ప్రభుత్వం జరిపిస్తుందన్నారు. సీఎం పై బాల్కాసుమన్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, పాలెపు నర్సయ్య, నల్ల గణేష్ గుప్త, బుచ్చిమల్లయ్య, శ్రీను, అజాహరోద్దీన్, మారయ్య, గణేష్ గౌడ్, గంగరాజం, హన్మంతు, నరేష్, ప్రసాద్, ప్రవీన్, జగదీశ్, దీపక్‌నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.













ఉన్నతాధికారి ఉత్తర్వులు బేఖాతర్!

● డిప్యూటేషన్‌ను రిలీవ్ చేయని హెచ్‌ఎం ● ఒక్కరి రిలీవింగ్‌తో పది మందికి స్థానచలనం ● విద్యాశాఖలో విచిత్రధోరణి

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 6 : జిల్లా విద్యాశాఖాధికారి డిప్యూటేషన్లలో కొనసాగుతున్న వారిని తమ స్వంత స్థానాలకు వెళ్లాలని ఉత్తర్వులు ఇచ్చినా ఆ ఉత్తర్వులను ప్రధానోపాధ్యాయులు పెడచెవిన పెడుతున్నారు. డిప్యూటేషన్లలో కొనసాగుతున్న ఉపాధ్యాయులను తమ యథాస్థానాలకు వెళ్లాలని ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఇటీవల జిల్లాలో డిప్యూటేషన్లపై కొనసాగుతున్న ఉపాధ్యాయులను తమ స్వంత స్థానాలకు వెళ్లాలని ఆదేశాలు ఇచ్చినప్పటికి వాటిని ప్రధానోపాధ్యాయులు తుంగలో తొక్కడం విద్యాశాఖలో చర్చనీయాంశమైంది. ధర్పల్లి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న నాగమణి ప్రస్తుతం బోర్గాం(పి) పాఠశాలలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. బోర్గాం (పి)పాఠశాలలో విద్యార్థులు అధికంగా ఉండడంతో విద్యార్థులు తక్కువగా ఉన్న చోటు నుంచి ఆపాఠశాలకు ఉపాధ్యాయులను డీఈవో డిప్యూటేషన్‌పై వేశారు. ఆ పాఠశాలలో నలుగురు గణితం బోధించే ఉపాధ్యాయులు ఉండగా మిగత ఇద్దరిని డిప్యూటేషన్ వేశారు. మాజీ శాసన సభ్యుడు సిఫారసుతో డిప్యూటేషన్ వేయగా ప్రస్తుతం పదవ తరగతి సిలబస్ పూర్తయింది. ఇటీవల ధర్పల్లికి చెందిన ఉపాధ్యాయులు స్థానిక ప్రజాప్రతనిధులతో మాట్లాడి బోర్గాం(పి) పాఠశాలలో పనిచేస్తున్న సదరు ఉపాధ్యాయురాలిని రిలీవ్ చేయడం వల్ల 8నుంచి 10మంది ఉపాధ్యాయులకు స్థానచలనం కలిగే అవకాశం ఉంది. అయినప్పటికి బోర్గాం(పి)పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యాశాఖ అధికారి ఆదేశాలను బేఖాతరు చేయడం విద్యాశాఖలో ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం పదో తరగతి విద్యార్థుల సిలబస్ పూర్తి కావడం, ప్రస్తుతం గణితం బోధిస్తున్న ఉపాధ్యాయురాలు సైన్స్ టీచర్ అయినప్పటికి ఆ హెచ్‌ఎం వ్యవహార శైలి అంతుచిక్కని వ్యవహరంగా మారింది. డిప్యూటేషన్లు రద్దు చేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తున్న స్వయంగా జిల్లా విద్యాశాఖాధికారి ఇచ్చిన ఆదేశాలను సదరు ప్రధానోపాధ్యాయుడు నిర్లక్ష్యం చేయడంపై టీచర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ ప్రధానోపాధ్యాయుడు కాగా.. ఇటీవల విద్యాశాఖలో బోర్గాం(పి)పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న సదరు వ్యక్తి అన్ని తానై వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. టెక్నికల్ కోర్సు ఇంచార్జీతో పాటు ఇటీవల విద్యాశాఖలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీలలో సదరు ప్రధానోపాధ్యాయుడు కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. .

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి6: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సీహెచ్.తిరుపతి అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి మండలంలోని తొర్లికొండ గ్రామంలో సైబర్ నేరాల పట్ల గ్రామస్థులకు ఎస్సై సీహెచ్.తిరుపతిరెడ్డి అవగాహన సదస్సు నిర్వహించారు సైబర్‌నేరాలు, గంజాయి, మత్తుపదార్థాలు, సీసీ కెమెరాలు, ట్రాఫిక్ నిబంధనలపై ఎస్సై సీహెచ్.తిరుపతి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్సై సుశీలకుమార్, పోలీసులు, తొర్లికొండ గ్రామస్థులు పాల్గొన్నారు.


కంఠేశ్వర్‌లో కిడ్నాపైన బాలుడి ఆచూకీ లభ్యం

● నిజామాబాద్‌లో బాలుడిని కిడ్నాప్ చేసి మోర్తాడ్‌లో వరదకాలువపై వదిలివెళ్లిన కిడ్నాపర్లు ● తల్లికి బాలుడిని అప్పగించిన పోలీసులు

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 6: రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈనెల 5నకిడ్నాప్‌కు గురైన ఏడాదిన్నర బాలుడి గణేష్ ఆచూకీ లభ్యమైంది. నిర్మల్‌కు చెందిన యువతి నిజామాబాద్ కోర్టు చౌరస్తా వద్ద భిక్షాటన చేస్తుండగా, ఇద్దరు వ్యక్తులు బాలుడిని అపహరించారు. బాలుడి తల్లి ఫిర్యాదుమేరకు రూరల్ పోలీసులు రంగంలోకి దిగారు. స్పెషల్ టీంగాలింపులో బాలుడిఆచూకీ మోర్తాడ్ మండలంలోని ఓ కాల్వ పక్కన బాలుడిని గుర్తించారు. పోలీసులు గాలిస్తుండటంతో కిడ్నాపర్లు బాలుడిని వదిలివెళ్లారు. దాంతో పోలీసులు బాలుడిని తీసుకువచ్చిరూరల్ పోలీసు స్టేషన్‌లో బాలుడి తల్లికి అప్పగించినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపారు.

మోర్తాడ్: మండల కేంద్రంలో పాలెం వరదకాలువ వద్ద బాలుడిని పోలీసుల అందిన సమాచారం మేరకు ఆ బాలుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుడు దుర్గాయ్య గ్రామంలో సేకరించిన చెత్తను వరదకాలువ ప్రాంతంలో డంప్ చేసేందుకు వెళ్లగా అక్కడ బాలుడు ఏడుస్తూ కనిపించాడు. దీంతో చుట్టు పక్కల ఎవరు బాలుడిని సంబంధించిన వారు లేకపోవడంతో ఆయన పిల్లవాణి తీసుకొని పోలీసులకు అప్పగించాడు. కాగా స్థానిక ఎస్సై అనిల్‌రెడ్డి ఈ పిల్లవాడు నిజామాబాద్‌లోని రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కిడ్నాప్ అయినట్టు తెలుసుకొని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, జ్యోతిలకు అప్పజెప్పారు. అయితే నిజామాబాద్‌లో మూడు రోజుల క్రితం పిల్లవాడు కిడ్నాప్ అయినట్టు కేసు నమోదు అయ్యిందని గుర్తించి ఐసీడీఎస్ అధికారి ఉషారాణి, అంగన్‌వాడి టీచర్ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ఆర్మూర్‌లోని ఏసీపీ కార్యాలయానికి తీసుకువెళ్లారు. ఈ విషయం తెలిసిన నిజామాబాద్ రూరల్ పోలీసులు ఏసీపీ కార్యాలయానికి వచ్చి ఉన్నారు. బాలుడిని గుర్తించి నిజామాబాద్‌లో కిడ్నాప్ అయిన బాలుడిని నిజామాబాద్‌రూరల్ పోలీసులు తీసుకువెళ్లారు. జిల్లాలో ముగ్గురిని కిడ్నాప్ అయినట్టు పోలీసుల ద్వారా తెలిసింది. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అనిల్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సకాలంలో స్పందించిన ఎస్సై అనిల్‌రెడ్డిని, ఐసీడీఎస్ అధికారులు ఉషారాణిని ఏసీపీ పోలీసులు అభినందించారు.


బాలుడిని తల్లికి అప్పగిస్తున్న రూరల్ పోలీసులు



బైక్‌ను ఢీకొట్టిన కారు

● ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి
● మృతులు మహారాష్ట్రలోని దెగ్లూర్ వాసులు

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 6 : కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ శివారులో మంగళవారం బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. మహారాష్ట్ర లోని దెగ్లూర్‌కు చెందిన వెంకటేష్ శంబాజీ బన్సుడే(25), వాగ్మారే నిఖిల్ (20), సూర్యవంశీ సోంనాథ్‌లు ముగ్గురు చిన్ననాటిస్నేహితులు. వీరంతా వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్నారు. అయితే ఓ ఇంటి పని చేసేందుకు మంగళవారం కామారెడ్డిజిల్లాలోని పెద్ద కొడప్‌గల్ మండలం తలాబ్ తండా కు ముగ్గురు కలిసి బైక్‌పై బయలు దేరారు. మార్గమధ్యలో పెద్దకొడప్‌గల్ శివారులోని 161వ జాతీయ రహ దారిపై వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను హైదరాబాద్ నుంచి దెగ్లూర్ వైపు వెళుతున్న కారుఅతి వేగంతో బలంగా ఢీకొట్టింది.ఈఘటనలో వెంకటేష్ శంబా జీ బన్సుడే, వాగ్మారే నిఖిల్ అక్కడికక్కడే మృతి చెందగా.. సూర్యవంశీ సోంనాథ్ గాయపడ్డాడు. ప్రమాద విషయం తెలియగానే బిచ్కుంద సీఐ జగడంనరేష్ ఘటనాస్థలికి చేరుకుని కారు కింది భాగంలో ఇరుక్కుపోయిన నిఖిల్ మృతదే హాన్ని క్రేన్ సహాయంతో బయటకు తీయడానికి అధికార గణం తీవ్రప్రయత్నం చేసి చివరకు తీశారు. మృతుడి బంధువు యాదవ్ నివర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాలను బాన్సువాడ ఆసుపత్రికి తరలించారు.



భిక్కనూరు పర్మిట్‌రూంలో మద్యం బాటిల్‌తో దాడి


ముత్యంనుఅదుపులోకి తీసుకుంటున్న పోలీసులు , గాయపడిన వ్యక్తి

భిక్కనూరు, ఫిబ్రవరి 6: మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగన గొడవలో ఒకరు పక్కనే ఉన్న మద్యం బాటిల్‌ను పగులగొట్టి ఎదుటి వ్యక్తిపై దాడిచేసి పొడిచిన సంఘటన భిక్కనూరు మండలకేంద్రంలోని సిద్ధరామేశ్వర వైన్స్ పర్మిట్‌రూంలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసు కుంది. ప్రత్యక్షసాక్షులు, పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బత్తు పెద్ద ముత్యం, కర్నాల నరేష్ సిద్ధరామేశ్వర వైన్స్ పక్కనే ఉన్న పర్మిట్‌రూంలో వేర్వేరుగా వారివారి స్నేహితులతో మద్యం తాగుతున్నారు. గత కొన్నిరోజుల క్రితం నరేష్ సెల్‌ఫోన్ దొంగతనానికి గురికాగా ఆ విషయంపై నరేష్ వారి స్నేహితులతో మాట్లాడుతుండగా పెద్దముత్యం నరేష్ వద్దకు వచ్చి కలుగజేసుకుని వాగ్వాదానికి దిగాడు.దింతో మద్యం మత్తులో ఉన్న ఇద్దరు సహనం కోల్పోయి ఒకరినొకరు దాడి చేసుకోగా పర్మిట్‌రూంలో పక్కనే ఉన్న మద్యం బాటిల్‌ను పగులగొట్టి పెద్దముత్యం నరేష్‌పై దాడి చేసి మెడ, చెవి వద్ద పొడిచాడు. దింతో నరేష్‌కు తీవ్రగాయాలై రక్తస్రావ మైంది. వెంటనే వైన్స్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందివ్వగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన నరేష్‌ను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి, దాడికి పాల్పడిన పెద్దముత్యంను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.ఎస్సైమాట్లాడుతూ బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు



పసుపు రైతులకు మద్దతు ధర వచ్చేటట్టు చూడాలి


కేంద్ర మంత్రి కలిసిన తిరుపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 6: ఢిల్లీలో మంగళవారం ఎంఎస్‌ఎంఈ శాఖ మంత్రి నారాయణరాణి తాటినిల్లా పసుపు రైతుల సంఘం అధ్యక్షుడు తిరుపతిరెడ్డి కలిశారు. అనంతరం పసుపు రైతులకు మద్దతు ధర వచ్చేలా చూడాలని, పసుపు రైతుల సమస్యలు పరిష్కరించాలని, పసుపు పంటకు కేంద్రం ఎగుమతులు, దిగుమతుల ద్వారా పసుపు పంటకు అధిక మద్దతు ధర వచ్చేలా చూడాలని, భవిష్యత్‌లో పసుపుబోర్డు ఏర్పా టు చేసి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని కేంద్ర మంత్రికి ఇచ్చిన వినతిపత్రంలో జిల్లా పసుపు రైతుల సంఘం అధ్యక్షుడు పి.తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. జిలా్లలోని కమ్మర్‌పల్లి, వేల్పూర్, ధర్పల్లి మండలాల్లో సైన్స్ పార్కు కొరకు నిర్దయించిన భూముల్లో కమ్మర్‌పల్లిలో తప్ప ఏలాంటి పనులు జరగలేదని,ఈ మండలాల్లో భూములు పాడవుగా ఉన్నాయని భూములు కేంద్ర ప్రభుత్వం పసుపుబోర్డు ఏర్పాటు చేసిందని పాడవుగా ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం పసుపు రైతులకు అండగా ఉండాలని కేంద్ర మంత్రికి ఇచ్చిన వినతి పత్రంలో జిల్లా పసుపు రైతుల సంఘం అధ్యక్షుడు పి.తిరుపతిరెడ్డి కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

ఎడపల్లి, ఫిబ్రవరి 6: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారిని ఉన్నత స్థాయిలో ఉంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తె. మీడియంను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉఆధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టికలను ఆయన పరిశీలించారు. ఎఫ్ఎల్ఎస్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

మహిళ ప్రాంగణం అధికారిపై విషప్రయోగం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి6: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మహిళ ప్రాంగణం జిల్లా అధికారిణి పద్మపై ఔట్‌సోర్సింగ్ సిబ్బంది విషప్రయోగం చేసినట్టు ఆమె తెలిపారు. మంగళవారం పెర్కిట్‌లోని మహిళ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా మహిళ ప్రాంగణంలో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సత్తెమ్మను సస్పెండ్ చేయగా మరో సిబ్బంది అలివేలుతో కలిసి విషప్రయోగం చేయడానికి పన్నగం పన్నారని పద్మ తెలిపారు. తాను తాగే జ్యూస్, అన్నంలో విషం కల్పడానికి అనితను వారు సంప్రదించగా విషయం బయటకు తెలియడంతో ఐదు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశానని ఆమె తెలిపారు. తక్షణమే విషప్రయోగానికి ప్రయత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

అలీసాగర్ గార్డెన్ పరిశీలన

ఎడపల్లి, ఫిబ్రవరి 6: ఎడపల్లి మండలంలోని రాణాకలాన్ గ్రామ శివారులోగల అలీసాగర్ ఉద్యానవనాన్ని మంగళవారం జిల్లా విజిలెన్స్ అధికారి నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఆర్డీవో పీడీ చందర్ నాయక్ ఆదేశాల మేరకు గార్డెన్‌లో చేపట్టిన పనులను పరిశీలించామని దాదాపు పనులు పూర్తి కావచ్చాయని ఆయన అన్నారు. వాటికి సంబందించిన రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన తెలిపారు. రెండు నెలల క్రితం ఈదురు గాలులకు భారీ నష్టం వాటిల్లిందని వాటిని కూడా రిపేరు చేయించాలని ఏఈకి సూచించడం జరిగిందన్నారు. ఈ క్యాక్రమంలో ఆయన వెంట ఎంపిడిఓ గోపాల కృష్ణ, ఏపీఓ శ్రీవాణి తదితరులు ఉన్నారు.


పెద్దమల్లారెడ్డిలో కిడ్నాపర్ల సంచారం?

భిక్కనూరు,ఫిబ్రవరి 6: గ్రామ హైస్కూల్ పక్కన కారు ఆపి గ్రామంలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారని, వారు తప్పకుండా చిన్నపిల్లలను ఎత్తుకెళ్లే ముఠాసభ్యులని ఆనోట ఈనోట గ్రామంలో వ్యాపించడంతో గ్రామస్థులు భయాందోళనకు గురై పోలీసులను ఆశ్రయించిన సంఘటన భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథ నం ప్రకారం దాదాపు సాయంత్రం ఐదు గంటల ప్రాంతం నుంచి గ్రామంలోని బాలుర ఉన్నత పాఠశాల పక్కన హెచ్‌ఆర్ 28కె 0584 నెంబరు గల స్విఫ్ట్ కారు నిలిపి ఉండి అందులో ఒక వ్యక్తి కూర్చుని ఉన్నాడు. గ్రామానికి చెందిన యువకులు అతడి వద్దకు వెళ్లి మీకు ఎవరు కావాలి ఎక్కడి వచ్చారు అని ప్రశ్నించగా నేను గూగుల్ మ్యాప్ చూసుకుంటు ఇటువైపు వచ్చానని నేను హైదరాబాద్‌కు వెళ్లాలని సమాధానం ఇచ్చారు. మరి సాయంత్రం ఐదు గంటల నుంచి తొమ్మిది గంట వరకు ఇక్కడే ఎందుకున్నావు ఇటువైపు నుండి వెళ్తె హైదరాబాద్‌కు వెళ్లవచ్చునని ఎన్నిసార్లు చెప్పిన అతను అక్కడి నుంచి వెళ్లలేదు. అదే సమయంలో కంచర్ల గ్రామానికి వెళ్లె దారిలో మరో ఇద్దరు అనుమా నాస్పదంగా తిరుగుతున్నారని గ్రామంలోని వాట్సప్ గ్రూప్‌లలో చక్కర్లు కొట్టడం, ఈ వార్త గ్రామంలో వ్యాపించడంతో పెద్దఎత్తున యువకులు వారిని పట్టుకునేందుకు పోగవుతున్నారు. దీన్ని గమనించిన కారులో ఉన్న వ్యక్తి కారును చాలా స్పీడ్‌తో వెళ్లి మిగితా ఇద్దరిని సైతం కారులో ఎక్కిం చుకుని కంచర్ల వైపు పారిపోయారు. దీంతో గ్రామ యువకులు బైక్‌లపై వారిని ఫాలో అయిన వారు దొరకకపోవడంతో భిక్కనూరు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సమాచారం అందుకున్న భిక్కనూరు ఎస్సై పెట్రోలింగ్ సిబ్బందిని దోమకొండ, బీబీపేట పోలీసులను అలెర్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామం లోని ముగ్గురు అనుమానంగా కారులో వచ్చి గ్రామంలో అనుమా నాస్పదంగా తిరుగుతు న్నారని గ్రామస్థులు తమకు సమాచారం అందించారన్నారు. కంచర్ల వైపు వెళ్లిన వారిని పట్టుకోవడానికి మూడు టీంలను ఏర్పాటు చేయ్యడం జరిగిందన్నారు. ప్రజలు ఎవరు భయపడోద్దని,పెట్రోలింగ్‌ను గ్రామంలోముమ్మరం చేశామని సూచించారు.

పోతంగల్ సహకార సంఘంలో 9మంది డైరెక్టర్ల రాజీనామా

కోటగిరి,ఫిబ్రవరి6: రాష్ట్రంలోనే పేరుగాంచిన పోతంగల్ విశాల పరపతి సంఘం పాలకవర్గంలో మెజారిటీ సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. పోతంగల్ సహకార సంఘం కార్యాలయంలో కార్యదర్శి భరత్‌కు మంగళవారం రాజీనామా పత్రాలను సమర్పించారు. రాజీనామా చేసిన వారిలో ఉపాధ్యక్షుడు పవన్ కుమార్, లక్ష్మి, రూప్‌సింగ్, లింగాప్ప, చిన్న గంగారాం, చంద్రమ్మ, భగవన్ రావు, శ్రీనివాస్‌రావులు ఉన్నారు.





బాల్క సుమన్ దిష్టిబొమ్మల దహనం

● జిల్లా వ్యాప్తంగా బాల్క సుమన్ దిష్టిబొమ్మల దహనాలు ● క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకుల ఆందోళనలు



సిరికొండలో బాల్క సుమన్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఆర్మూర్‌లో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరికొండ ఫిబ్రవరి 6: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్‌పై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిరికొండలో దిష్టి బొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల శాఖ తరఫున కార్యకర్తలు సిరికొండకు తరలివచ్చి చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తెలంగాణ చౌరస్తాలో సుమన్ దిష్టి బొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాకారం రవి మాట్లాడుతూ రెండు నెలల క్రితమే ప్రజలు బుద్ధిచెప్పిన బీఆర్ఎస్ నేతల్లో అహం తగ్గక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. నోటి దురుసుతనాన్ని అదుపులో పెట్టుకోకుంటే కాంగ్రెస్ కార్యకర్తలు తగిన బుద్ధి చెపుతారని రవి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శులు ఎర్రన్న, సంతోష్,నర్సారెడ్డి, బాల్‌రాజ్ నాయక్, మాజీ సర్పంచ్‌లు మహిపాల్, కృష్ణసంజీవ్, నాయకులు శివాజీ, మల్లేష్, లక్ష్మన్, రాజేశ్వర్‌గౌడ్,రమేష్‌కుందేళ్ల శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, చందర్,జీవన్, మహేష్‌రెడ్డి,ముత్తెన్న, జనార్దన్, బాస్కర్, బాబుప్రసాద్,గంగారెడ్డి, సాయన్న, రాములు, వినోద్,నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి: సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ ఎస్ నాయకుడు బాల్క సుమన్ చిత్రపటానికి మంగళవారం కాం గ్రెస్ నాయకులు చెప్పుల దండ వేసి చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఈరంటి లింగం మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని లేని ఎడల రాష్ట్రంలో తిరగనియ్యమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బంజ కామప్ప, రాజ్ కుమార్, తదితరులు ఉన్నారు.

మోస్రా: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిపై బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. మోస్రా మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బాల్క సుమన్ దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టి బాల్క సుమన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హరి నారాయణ, అశోక్, పోతారెడ్డి, వినయ్ రెడ్డి, చింటూ, నర్సారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: కృష్ణబోర్డుకు ప్రాజెక్టులను అప్పజేప్పేందుకు కేసీఆరే సంతకం చేసారంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై పరుష పదజాలంతో దూషించడం తగదని రాష్ట్రం సస్యశామలం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు చెప్పుతో కొడుతామని చెప్పడం వారి నైతికతకు నిదర్శనమని బ్లాక్ కాంగ్రెస్ రూరల్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్, అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ ఫొటోకు చెప్పుల దండ వేసి నిరసన తెలిపారు. అనంతరం సుమన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కోరట్‌పల్లి డా. జహుర్, సుద్దులంలో సురేందర్‌రెడ్డి, ఆధ్వర్యంలో బాల్కసుమన్ చిత్రపటాలకు చెప్పుల దండలు వేసి నిరసన తెలిపారు. ఈకార్యక్ర మంలో పార్టీ ప్రతినిధులు డా.షాదుల్ల, పులివెంక టేశ్వరరావు,డా.జహుర్, నరేందర్, పెద్దోళ్ల శ్రీనివాస్, చిన్నరెడ్డి,రాం పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్: బీఆర్ఎస్ నేత బాల్క సుమన్‌పై రూరల్ పోలీసు స్టేషన్‌లో స్థానిక కాంగ్రెస్ నేతలు ఫిర్యాదుచేశారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిపై బాల్క సుమన్ అనుచిత వాఖ్యలు చేశారని, ఆయనపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. రూరల్ కాంగ్రెస్ నేతలు జి.రమేష్, లింగం,లింగారెడ్డి తదితరులున్నారు.

మోర్తాడ్: రాష్ట్రసీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్‌పై కేసు నమోదు చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, జిల్లా కార్యదర్శి గిర్మాజీ గోపిలు ఫిర్యాదు చేశారు. మంగళవారం వేణుగోపాల్‌యాదవ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం పట్ల ఏ మాత్రం గౌరవం ఉన్న రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన మాటలు బాల్కసుమన్ చరిత్ర క్షమించబోదని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీఎంపీపీ గిర్మాజీ గంగాధర్, పుప్పాల అశోక్, జక్కం అశోక్, నజీర్, గంగారాం, ప్రణయ్, శ్రీధర్, వినోద్; నవీన్, రమేష్‌లు పాల్గొన్నారు.

మెండోర: తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డిపై చెన్నూరు మాజీఎమ్మెల్యే బాల్కసుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తక్షణమే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌లో చెన్నూర్ మాజీఎమ్మెల్యే సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా పోలీస్‌స్టేషన్‌లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండోజి రవి, సోం రాజేంధర్, రేహన్, రఫీ, రమేష్, చందు, వరిగడ్డి రవి, డిసి.గంగయ్య, కొప్పెల మోహన్, బద్దం అశోక్, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ రూరల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పైన అనుచిత వాక్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే బాల్కసుమన్ పైన కేసు నమోదు చేయాలని భీమ్‌గల్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌లో సబ్‌ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు చేయడం జరిగింది. అనంతరం భీమ్‌గల్‌లో సుమంగళి చౌరస్తా వద్ద బాల్కసుమన్ దిష్టి బొమ్మను కాంగ్రెస్ కార్యకర్తలుదహనం చేశారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

నిజామాబాద్‌అర్బన్:సీఎం.రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నాయకులు బాల్కసుమన్ చిత్రపటానికి మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో చెప్పుల దండ వేసి ధహనం చేశారు. నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బాల్కసుమన్ చిత్రపటానికి ఎస్సీసెల్ జిల్లా, నగర అధ్యక్షులు లింగం, వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో చెప్పులదండ వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం.రేవంత్‌రెడ్డిపై బాల్కసుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలు అతని సిగ్గుమాలిన తనానికి నిదర్శణమన్నారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని ఇవ్వనప్పుడు,దళితులను సీఎం చేస్తానని చేయనప్పుడు కేసీఆర్ బాల్కసుమన్ ఎందుకు మాట్లాడలేదన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్: సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీఎమ్మెల్యే బాల్కసుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన చేపట్టారు.ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద బాల్క సుమన్ దిష్టి బొమ్మను దహనం చేశారు.

మద్యం తాగి నడిపిన వారికి జైలు

ఖిల్లా , ఫిబ్రవరి 6: మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి నాలు గు రోజుల జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మహ్మద్ ఖదీర్ మంగళ వారం తీర్పు చెప్పారు. ఈనెల 4న నగరంలోని ఖిల్లా ప్రాంతానికి చెందిన షేక్‌అబ్బాస్ అనే వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతుండగా పోలీసులు పట్టుకుని మంగళవారం కోర్టు ఎదుట హాజరుపర్చినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ తెలిపారు. మద్యం సేవించి ఉన్నట్లు తేలడంతో ఆయనకు నాలుగురోజుల జైలు శిక్ష విధించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

16న అంగన్‌వాడీల దేశ వ్యాప్త సమ్మె

సాలూర, ఫిబ్రవరి 6: బోధన్ పట్టణంలోని సీడీపీవో కార్యాలయంలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా కార్యాలయంలో సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్‌గౌడ్ మాట్లాడుతూ మోదీ సర్కార్ పది సంవత్సరాలు ఉండి కార్మిక వర్గం గురించి ఏనాడూ పట్టించుకోలేద న్నారు. కరోనా కష్ట కాలంలో అంగన్‌వాడీ కార్మికులు ప్రజలకు సేవ చేస్తా ఉంటే ప్రధాని చూస్తూ ఊరుకున్నారే తప్పా వారి సంక్షేమానికి కృషి చేయలేదని ఆరోపించారు. పారిశ్రామిక వేత్తల కోసం కోట్లాది రూపా యలు ఖర్చు పెట్టే మోదీసర్కార్ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరిం చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. 16న జరిగే సమ్మెలో అంగన్‌వాడీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బోధన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు మంగాదేవి, విక్టోరియా రాణి, రేణుకా, లావణ్య, పద్మ, గంగామణి, సునీత తదితరులు ఉన్నారు.

నేడు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం

కోటగిరి,ఫిబ్రవరి5: బాన్సువాడ నియోజకవర్గ కేంద్రంలో ఎస్ఎంబీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి కార్యకర్తలు తరలిరావాలని మండల బీఆర్ఎస్ అధ్యక్షులు ఏజాజ్ ఖాన్ తెలిపారు. మాజీ స్పీకర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన 10గంటలకు సమావేశం ప్రారంభమవుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్యకర్తలు తరలిరావాలన్నారు.

విగ్రహం దిమ్మెను ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు

కోటగిరి,ఫిబ్రవరి5: పోతంగల్ మండలంలోని హంగర్గ ఫారం గ్రామంలోని ప్రధాన కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం దిమ్మెను ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. సోమవారం రాత్రి షేక్.సాజీద్ అనే వ్యక్తి అర్ధరాత్రి సమయంలో లారీని అతివేగంగా నడిపి విగ్రహాన్ని ఢీకొట్టగా దిమ్మె, నిచ్చెన ధ్వంసం అయిందని ఎస్ఐ తెలిపారు. గ్రామానికి చెందిన షిండే పీరాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

29న హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన



సమావేశంలో మాట్లాడుతున్న గ్రామ పెద్దలు

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 6: బోధన్‌పట్టణంలోని నడిబొడ్డులో ఊరు హనుమాన్ ఆలయం వద్ద వీడీసీ అధ్యక్షుడు బాగారెడ్డితో పాటు గ్రామపెద్దలు సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల సంక్షేమం కోసం నిర్మించిన హనుమాన్ మందిరంలో ఈనెల 29వ తేదిన హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందన్నారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య మూడు రోజుల పాటు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించబడుతాయన్నారు.బోధన్ వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు బీర్కూర్ బుజ్జి, సూర్యప్రకాష్ రెడ్డి,రుద్రసత్యనారాయణ,లింగం తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి సొసైటీ ఛైర్మన్ పదవికి రాజీనామా

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 6: డిచ్‌పల్లి సహకార సంఘ ఛైర్మన్‌గా కొనసాగుతున్న గజవాడ జైపాల్ తన పదవికి వ్యక్తిగత కారణాలతో మంగళవారం సాయంత్రం రాజీనామా చేసి డీసీవో శ్రీనివాస్‌రావుకు అందజేశారు. తనపై ఏవరి ఒత్తిళ్లు లేవని, వ్యక్తి గత కారణాలతో రాజీనామా చేస్తునని జైపాల్ తెలిపారు. సోమవారంఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అధికారులు డిచ్‌పల్లిలోని జైపాల్ రైస్‌మిల్‌పై అధికారులు దాడులు నిర్వహించడం అనంతరం జైపాల్ రాజీనామా చేయడంపై అనుమానాలకు తావిస్తుంది.

కొనసాగుతున్న మెడికల్ చెకప్

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 6: పోలీసు శాఖలో కానిస్టేబుల్ పోస్టుల నియామకాల మెడికల్ చెకప్ మంగళవారం కొనసాగింది. పోలీసు కమీషనర్ కల్మేశ్వర్‌శింగనేవార్ పర్యవేక్షణలో సంబంధిత వైద్యాధికారులకు సూచనలు అందిం చారు. మంగళవారం మొత్తం 153 మంది హజరుకాగ 151 మందికి మెడికల్ చెకప్ నిర్వహించినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ తెలిపారు. ఈ చెకప్‌లో వైద్యు లు సయ్యద్ ఒమర్‌అహ్మద్,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డీజీపీ రవిగుప్తాను కలిసిన ఎమ్మెల్యే ధన్‌పాల్



డీజీపీని కలిసిన నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

పెద్దబజార్, ఫిబ్రవరి 6: హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన తెలంగాణా రాష్ట్ర డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు రవి గుప్తాను మంగళవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యానారయణ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నగరంలో లాఅండ్ ఆర్డర్ క్రైమ్ రేట్ గురించి అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి



ఆర్డీవో వినోద్‌కుమార్‌కు భూసమస్యను వివరిస్తున్న పద్మశాలి సంఘ సభ్యులు

ముప్కాల్, ఫిబ్రవరి6: బాల్కొండ మండల కేంద్రంలో గల ప్రభుత్వ భూములను కాపాడాలని ఆర్మూర్ ఆర్డీవో వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం బాల్కొండ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. 1333 సర్వేనెంబర్ గల ప్రభుత్వ భూమి కొలిచి హద్దులు నిర్ణయించడానికి జిల్లా కలెక్టర్ నలుగురు సర్వేయర్‌లను నియమించారని తెలిపారు. అదే విధంగా 1181 సర్వేనెంబర్ గల భూమిని బాల్కొండ శివారులో గల భూమి చెందిన సమస్యను పరిష్కరించాలని పద్మశాలి సంఘం సభ్యులు ఆర్డీవోకు విన్నవించుకున్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

జాయ్‌అలుకాస్ ఫీల్డ్‌వర్క్ ప్రారంభం



ఎస్‌హెచ్‌వోకు పూలబొకే అందజేస్తున్న జాయ్‌అలుకాస్ అసిస్టెంట్ మేనేజర్

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి6: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ గురడిరెడ్డి సంఘ భవనంలో ఎస్‌హెచ్‌వో రవికుమార్ జాయఅలుకాస్ అసిస్టెంట్ మేనేజర్ కర్నకర్ మంగళవారం జాయ్‌అలుకాస్ ఫీల్డ్ వర్క్‌ను ప్రారంభించారు.ఈనెల 10,11,12తేదీల్లో జాయ్‌అలుకాస్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్సై లక్ష్మణ్, జాయ్‌అలుకాస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

రెంజల్,ఫిబ్రవరి5: అత్యుత్తమ అర్హతలు, అనుభవం కలిగిన ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నీలా, పేపర్‌మిల్, కందకుర్తి గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాలలో ఉపాధ్యాయులు కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. కందకుర్తి, నీలా గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. కందకుర్తి పాఠశాలలో మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయల కొరకు రూ.10లక్షలు, నీలా పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం కొరకు 6లక్షలు, ఇతర వసతుల కొరకు 4లక్షలు మంజూరు చేశారు. పేపర్‌మిల్ గ్రామంలో తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు 6లక్షలు, సీసీ రోడ్ల నిర్మాణం కోసం 3లక్షల నిధులు మంజూరు చేశారు. నీలాలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ బృందం విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. పదవ తరగతి ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో నిజామాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు పటిష్టంగా పని చేసి పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో గ్రామ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని, వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు తాహెర్‌బిన్ హందాన్, అంతిరెడ్డి రాజిరెడ్డి, మహిపాల్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు రాములు, సాయరెడ్డి, గయాసోద్దీన్, సురేందర్ గౌడ్, నితిన్, కార్తిక్, కిరణ్, పోచయ్య, షంషోద్దీన్, శ్రీనివాస్, సురేష్ పటేల్ పాల్గొన్నారు.

టీడీపీ పార్లమెంటరీ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్

సుభాష్‌నగర్,ఫిబ్రవరి 6:టీడీపీ పార్లమెంటరీ సర్వసభ్య సమావేశం పార్లమెంటరీ అధ్యక్షుడు దేగాంయాదగౌడ్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. జిల్లా కేంద్రంలోని జిల్లాపార్టీ ప్రధాన కార్యాలయంలో ఈ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ అభివృద్ధి కొరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పార్లమెంటరీ అధ్యక్షుడు దేగాం యాదగౌడ్ తెలిపారు. ఇందులో భాగంగానే అర్బన్ నూతన కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలోబోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట గోపాల్‌రెడ్డి, కమిటీ నాయకులు సీహెచ్ హన్మం త్‌రావు, వీరబ్రహ్మానందచారి, జ్యోతి నారాయణ, జనార్ధన్‌చారి, శ్రీనివాస్ బాబు, సచిన్ పటేల్, విఠల్‌రావు, రాజు పాల్గొన్నారు.

25కిలోల గంజాయి లభ్యం

మోపాల్, ఫిబ్రవరి 6 :మండలంలోని బాడ్సి గ్రామంలో అనుమానాస్పదంగా ఉన్న ఓ ఇంటి లో పోలీసులు, ఎక్సైజ్ శాఖాధికారులు మంగళవారం ఉద యం తనిఖీలు చేయగా ఆ ఇం టిలో 25కేజీల సుమారు రూ.6 లక్షల25 వేల విలువ చేసే ఎండుగంజాయి లభించినట్లు దక్షణ మండల రూరల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు.కచ్చితమైన సమాచారం మేరకు గ్రామానికి చెందిన కనుగుల ప్రసాద్ అనే వ్యక్తి గంజాయి అమ్ముతున్నట్లు గుర్తించిన పోలీసులు ఆయన ఇంటిపై సోదాలు చేశారు. ఈ సోదాల్లో గంజాయిని గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని ప్రసాద్‌పై కేసునమోదుకు మోపాల్ ఎస్ఐ గంగాధర్‌కు అప్పగించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



అంజయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

రెంజల్,ఫిబ్రవరి5: మండలంలోని బోర్గాం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అంజయ్య తల్లి గత వారం రోజుల క్రితం మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని మంగళవారం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పరామర్శించారు. మృతికి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా నాయకుడు తాహెర్ బిన్ హందాన్, మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్, అంతిరెడ్డి రాజిరెడ్డి, సాయిరెడ్డి, రాములు, నితిన్, పోచయ్య, జావీదోద్దీన్, కిరణ్,సురేష్ పటేల్ తదితరులున్నారు.

ప్రగతిని చాటేందుకే పల్లెబాట



గ్రామస్థులతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి

ఎడపల్లి, ఫిబ్రవరి 6: ప్రగతిని చాటేందుకు పల్లెబాట కార్యక్రమం చేపట్టినట్లు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి అన్నారు. మంగళవారం జానకంపేట గ్రామంలో బీజేపీ చేపట్టిన గావ్‌చలో ఘర్ చలో కార్యక్రమంలో ఆయన పాల్గొని గ్రామంలోని ప్రతి ఇంటికి, ప్రతీ కార్యాలయానికి వెళ్లి అక్కడ ఉన్న ప్రజలతో మాట్లాడి గ్రామంలో నెలకొన్న సమస్యలు, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రతీ ఒక్కరికి అందుతున్నాయో లేదో వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు గ్రామ శివారులోని లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ఆదేశాల మేరకు రాష్ట్రంలో గావ్‌చలో ఘర్‌చలో కార్యక్రమాన్ని 5వతేదీ నుంచి 11వ తేదీ వరకు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.ఈకార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో ప్రతీగ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి వారితో మాట్లాడటం జరుగుతుందన్నారు.రాష్ట్రపార్టీ చేపట్టిన పల్లెకు పోదాం ప్రతి వ్యక్తిని కలుద్దాం అనే కార్యక్రమంలో భాగంగా గ్రామంలో అన్ని వర్గాల వారిని, అంగన్ వాడి సెంటర్లను, మహిళా సంఘాలను, ప్రముఖులను, పార్టీ కార్యకర్తలను కలిసి గ్రామంలో నెలకొన్న సమస్యలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయోలేదో అడిగి తెలుసుకున్నామన్నారు. దేశం శుభిక్షంగా ఉండాలంటే, శత్రు దేశాలు మనదేశంపై కన్నెత్తి చూడద్దంటే కేంద్రంలో బీజేపీప్రభుత్వం నరేంద్ర మోడీ ప్రధానిగా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిజేపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్ రెడ్డి, బిజేపి పార్టీ బోదన్ నియోజక వర్గ కన్వీనర్ కూరెళ్ల శ్రీధర్, పార్టీ మండల అధ్యక్షులు కోల ఇంద్రకరణ్, నాయకులు సృజన్, సురేష్, వెల్మల విజయ్, బర్ధిపూర్ ప్రణయ్,అరుణ్ తదితరులు ఉన్నారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:రూ.140	రూ.215	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	:రూ.145	రూ.220	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,300	రూ.59,300	రూ.750

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (12.20,6.50)
: ఫైటర్ (హిందీ 3డీ) (3.15,9.45)
స్ర్కీన్-2 : ఫైటర్ (హిందీ 3డీ) (11.45)
: హనుమాన్ (తెలుగు) (3.20, 6.40, 10.00)
స్ర్కీన్-3 :అర్గిలీ(ఇంగ్లీష్)(11.00,7.45)
:గేమ్‌ఆన్(2.05)
: ధీర (5.05)
:అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (10.50)
స్ర్కీన్-4 : కిస్మత్ (10.10,7.15)
: బూట్‌కట్‌బాలరాజు (1.00)
:హ్యాపీఎండింగ్ (4.05)
: ధీర (10.05)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (10.30,1.30, 4.30, 7.30, 10.30)
స్ర్కీన్-3 : హనుమాన్ (1.30,4.30, 7.30,10.30)

దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : గుంటూరుకారం (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కిస్మత్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ :అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్